https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 30 ఆదివారం 24-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505285656.

## జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం..




హైదరాబాద్,మే 23

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## రాబోయే కాలంలో ఏ శక్తి భారత్‌ను ఆపలేదు : రాజ్‌నాథ్ సింగ్

షిర్డి, మే 23:



ఒకప్పుడు ఆయుధాలు దిగుమతి చేసుకునే దశలో ఉన్న ఇండియా రాబోయే 25-30 ఏళ్లలో అతిపెద్ద ఆయుధాల సరఫరాదారుగా నిలవనుందని, దీనిని ఏ శక్తీ అడ్డుకోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. షిర్డీలో మందుగుడు సామాగ్రి తయారీ కేంద్రాన్ని శనివారంనాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్షణ ఉత్పత్తులల్లో ప్రైవేటు రంగం పాత్రను 50 శాతానికి తీసుకు వెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు. రక్షణరంగానికి కేవలం నట్లు, బోల్టుల సరఫరాదారుగానే ప్రైవేటు రంగం మిగిలిపోవడం లేదన్నారు. అత్యాధునిక ఆయు ధాల వ్యవస్థలో కీలక తయారీదారుగా ఉండనుందని చెప్పారు. ప్రభుత్వ విజన్, ప్రైవేట్ సెక్టార్ వినూత్న ఆవిష్కరణల సమన్వయంతో దేశం కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. 'అందరం కలిసికట్టుగా పనిచేసి భారత్‌ను మందుగుండు సామాగ్రి తయారీ, ఆటోమేషన్ హబ్‌గా రూపొందిద్దాం' అని అన్నారు.

## కర్ణాటక నుంచి రాజ్యసభ రేసులో ఖర్గే, దేవెగౌడ..



బెంగళూరు :

కర్ణాటకతో సహా 10 రాష్ట్రాల నుంచి ఖాళీగా ఉన్న 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో రాజకీయ వేడి ఊపందుకుం టోంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికా ర్జున్ ఖర్గే, జేడీ(ఎస్) సుప్రీం హెచ్‌డీ దేవెగౌడ ను కర్ణాటక నుంచి రెండోసారి రాజ్యసభకు పంపే అవకాశాలపై ఊహాగానాలు ఊపందు కుంటున్నాయి. బీజేపీ రాజ్యసభ సభ్యులైన ఈరన్న బి కడాడి, కె.నారాయణతో పాటు మల్లికార్జున్ ఖర్గే, దేవెగౌడల రాజ్యసభ పదవీ కాలం జూన్ 25వ తేదీతో ముగియ నుంది. కర్ణాటకలో బలాబలాల పరంగా చూస్తే కాంగ్రెస్‌కు కర్ణాటక నుంచి 3 సీట్లు గెలుచు కునే బలం ఉంది. ఎన్డీయే ఒక సీటు గెలుచు కోగలదు. కర్ణాటకలో నాయకత్వ మా ర్పు జరుగనుందంటూ కొద్దికాలంగా ఊహా గానా లు వినిపిస్తున్న నేపథ్యంలో మల్లికా ర్జున్ ఖర్గే రీ-నామినేషన్ వ్యవహారం తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్డీయే పరంగా చూస్తే జేడీ(ఎస్)తో పొత్తు పదిలం చేసుకోవాలంటే బీజేపీ తమకున్న ఏకైక సీటును దేవెగౌడకు వదులుకోవాల్సి ఉంటుం ది. అయితే బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ మాజీ సీఎం డీవీ సదానంద గౌడ పేరును బుధవారం నాడు ప్రతిపాదించింది. దీనిపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధా మోహ న్ అగర్వాల్ మాట్లాడుతూ, రాష్ట్ర విభాగం ఒక పేరును ప్రతిపాదించిందని, అయితే కూటమి నిర్ణయా లనేవి కేంద్ర నాయకత్వమే తీసుకో వాల్సి ఉంటుందని చెప్పారు.

# భారత్-అమెరికా వ్యూహాత్మక బంధం

### అమెరికా విదేశాంగ కార్యదర్శికి మోదీ స్వాగతం

### ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు

### ప్రపంచ శాంతి, భద్రత అంశాలపై సమాలోచనలు

### గ్లోబల్ మేలుకోసం కలిసి పనిచేస్తామన్న భారత్-అమెరికా



న్యూఢిల్లీ, మే 23

భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలకు సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా మోదీ, మార్కో రూబియో మధ్య సమాలోచనలు జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. భారత్, అమెరికా దేశాలు ప్రపంచ మేలుకోసం భవిష్యత్తులోనూ కలిసి పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరస్పర సహకారంతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే దిశగా ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుందని భావిస్తున్నారు. ఇటీవల కాలంలో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలపడుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత వంటి కీలక రంగాల్లో ఇరు దేశాలు ఇప్పటికే సన్నిహితంగా పనిచేస్తున్నాయి. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా భారత్‌తో భాగస్వామ్యానికి అమెరికా అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నట్లు సమాచారం. ప్రపంచ స్థాయిలో శాంతి, స్థిరత్వం కోసం భారత్‌తో కలిసి పనిచేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్-అమెరికా మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సంబంధాలు ప్రపంచ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. రాబోయే కాలంలో ఇరు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని దౌత్య వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# యాదాద్రిలో ఆధ్యాత్మిక మహాప్రాజెక్ట్

### తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాలకు శ్రీకారం

### రూ.99 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన

### తిరుమల తరహాలో యాదాద్రి అభివృద్ధికి భారీ ప్రణాళిక

### వేద విద్య, భక్తి వైభవానికి కొత్త అధ్యాయం



యాదాద్రి, మే 23:

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద సంప్రదాయ పరిరక్షణతో పాటు యాదాద్రిని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. వేద పాఠశాలతో పాటు యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం రూ.99.55 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు యాదాద్రి రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదాద్రిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు. భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి అభివృద్ధి తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని సీఎం వ్యాఖ్యాని ంచారు. రూ.43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భారీ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల విధానంలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్య అందించనున్నారు. ఈ సముదాయంలో యాగశాలలు, హోమ మండపాలు, వేద అధ్యయన కేంద్రాలు, గోశాల వంటి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణలో ఈ వేద పాఠశాల కీలక కేంద్రంగా నిలవనుందని పండితులు అభిప్రాయపడు తున్నారు. ఇదే కార్యక్రమంలో రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణ పనులకు కూడా భూమిపూజ జరిగింది. అలాగే కొండపై స్వామివారి నిత్య కల్యాణోత్సవాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యంగా వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో రక్షణ కానోపీ నిర్మాణ పనులు చేపట్టను న్నారు. రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ.1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే యాదాద్రి దేశంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటిగా నిలవనుందని భావిస్తున్నారు.

# స్టార్‌షిప్ పరీక్ష విజయవంతం

**- స్పేస్‌ఎక్స్ భారీ ప్రయోగం - హిందూ మహాసముద్రంలో ల్యాండింగ్ - ఎలన్ మస్క్ ప్రశంసలు**

టెక్సాస్, మే 23

ప్రపంచంలోనే అత్యంత భారీ, శక్తివంతమైన రాకెట్‌గా గుర్తింపు పొందిన స్టార్‌షిప్ వీ3ను స్పేస్‌ఎక్స్ సంస్థ విజయవంతంగా పరీక్షించింది. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన ఈ సంస్థ మూడవ తరం స్టార్‌షిప్ రాకెట్‌ను శుక్రవారం టెక్సాస్ నుంచి ప్రయోగించింది. గంటకు పైగా సాగిన ఈ టెస్ట్ ఫ్లైట్ అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. అనంతరం రాకెట్ హిందూ మహాసముద్రంలో విజయవంతంగా దిగినట్లు స్పేస్‌ఎక్స్ ప్రకటించింది. ఈ పరీక్షలో భాగంగా స్టార్‌షిప్ రాకెట్ పలు కీలక లక్ష్యాలను చేరుకున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారమే రాకెట్‌ను సముద్రంలో పేల్చివేసినట్లు తెలిపింది. రాకెట్ పనితీరు, వేడి నిరోధక వ్యవస్థలు, అంతరిక్ష ప్రయాణ సామర్థ్యాలను పరిశీలించేందుకు ఈ ప్రయోగం నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రయోగం ద్వారా భవిష్యత్తులో చంద్రుడు, అంగారక గ్రహ యాత్రలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపరచే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టెస్ట్ ఫ్లైట్ సందర్భంగా స్టార్‌షిప్ నుంచి 22 మాక్ శాటిలైట్లను కూడా విడుదల చేశారు. అలాగే రాకెట్‌కు అమర్చిన హీట్ షీల్డ్ పనితీరును విశ్లేషించేందుకు ప్రత్యేకంగా మరో శాటిలైట్‌ను పంపించారు. అంతరిక్షంలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యంపై ఈ ప్రయోగం కీలక సమాచారాన్ని అందించనుందని స్పేస్‌ఎక్స్ తెలిపింది. అయితే రాకెట్ అనుకున్న కక్ష్యలో పూర్తిగా ప్రయాణించలేదని సంస్థ అంగీకరించింది. ప్రయోగ సమయంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు స్పేస్‌ఎక్స్ వెల్లడించింది. రాకెట్ మంటలు అంటుకునే దశలో ఒక ఇంజిన్ విఫలమైనట్లు గుర్తించినట్లు తెలిపింది. అదేవిధంగా రాకెట్‌కు అనుసంధానించిన సూపర్ హెవీ బూస్టర్ కూడా అనుకున్న స్థాయిలో పనిచేయలేదని పేర్కొంది. ఆ బూస్టర్ చివరకు గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో పడిపోయినట్లు సమాచారం. ఈ లోపాలపై ఇప్పటికే సాంకేతిక బృందాలు విశ్లేషణ ప్రారంభించాయి. ప్రయోగం అనంతరం స్పేస్‌ఎక్స్ సంస్థ తమ ఎక్స్ ఖాతాలో సముద్రంపై స్టార్‌షిప్ దిగిన దృశ్యాలను పంచుకుంది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో



వైరల్‌గా మారాయి. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగ నిపుణులు, సాంకేతిక వేత్తలు ఈ ప్రయోగంపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. మానవాళిని అంతరిక్షంలో కొత్త దశకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ ఈ ప్రయోగాన్ని "ఎపిక్ ఫ్లైట్"గా అభివర్ణించారు. మానవాళి భవిష్యత్తు లక్ష్యాలకు ఇది గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో మరింత వేగంగా ముందుకు సాగేందుకు ఇలాంటి ప్రయోగాలు కీలకమని ఆయన తెలిపారు.

## అంత్యక్రియల్లో టెర్రరిస్టుల బహిరంగ హాజరు

### ఇస్లామాబాద్‌లో సంచలన ఘటన

### ప్రపంచానికి పాక్ అసలు రూపం




న్యూఢిల్లీ, మే 23

ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని ప్రపంచానికి పదేపదే చెబుతున్న పాకిస్థాన్ అసలు స్వరూపం మరోసారి బట్టబయలైంది. నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన టాప్ టెర్రరిస్టులు ఇస్లామాబాద్‌లో బహిరంగంగా ఒక అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. ఉగ్రవాదులకు పాకిస్థాన్ సురక్షిత కేంద్రంగా మారిందన్న ఆరోపణలకు ఈ ఘటన మరింత బలం చేకూర్చింది. ముఖ్యం గా అమెరికా ప్రక టించిన మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు ఒకేచోట కనిపించడం భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది. నిషేధిత అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన కీలక కమాండర్ అర్జుమంద్ గుల్జార్ దార్ అలి యాస్ హంజా బుర్హాన్ ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణిం చాడు. శుక్రవారం అతని అంత్యక్రి యలను ఇస్లామాబాద్‌లో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హిజ్బుల్ ముజాహి దీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్-బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ తదితర కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాకిస్థాన్‌పై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# గోల్డెన్ సిటీ జైసల్మేర్‌లో నీటి కష్టాలు

**పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల ఆందోళన**

**ఎండల తీవ్రతతో నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు**






**జైసల్మేర్, మే 23:**
రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన జైసల్మేర్ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గోల్డెన్ సిటీగా పేరుగాంచిన ఈ ఎడారి నగరంలో గత పది రోజులుగా నల్లాల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండిపోతున్న ఎండలు, వడగాలుల మధ్య నీటి కొరత ప్రజల జీవనాన్ని మరింత కష్టతరం చేసింది. జైసల్మేర్‌లో ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఎడారి ప్రాంతం కావడంతో వేడి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తాగునీరు అందకపోవడంతో ప్రజలు నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. మున్సిపల్ ట్యాంకర్లు నాలుగు నుంచి ఐదు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై రాజస్థాన్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు స్పందించారు. స్థానిక కాలువకు సంబంధించిన నిర్వహణ పనుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల నల్లాల ద్వారా నీరు సరఫరా చేయలేకపోతున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిరంజన మీనా వెల్లడించారు. ప్రస్తుతం నగరంలోని ఏడు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళు సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల్లో నల్లాల ద్వారా సాధారణ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నీటి కొరత సమస్య మళ్లీ రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


# యువ వాలీబాల్ క్రీడాకారుడి దారుణ హత్య

**మైనర్ బాలిక కుటుంబ సభ్యులపై హత్య ఆరోపణలు**

**మూడు రోజులపాటు చిత్రహింసలు..**

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి**







**ఫరీదాబాద్, మే 23**
మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం కారణంగా యువ వాలీబాల్ క్రీడాకారుడు దారుణ హత్యకు గురైన ఘటన హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో కలకలం రేపింది. రాజస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల వాలీబాల్ క్రీడాకారుడు మోను మృతిచెందగా, ఈ ఘటనపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మోను ఫరీదాబాద్‌కు చెందిన ఓ మైనర్ బాలికతో ప్రేమలో ఉన్నాడు. ఈ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసిన తర్వాత గత ఏప్రిల్‌లో బాలిక కిడ్నాప్ కేసులో మోనుపై ఫిర్యాదు నమోదైంది. అప్పటి నుంచి ఈ వ్యవహారం ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. మే 17న పోలీసు విచారణకు హాజరుకావడానికి బయలుదేరిన మోనును మార్గమధ్యంలోనే బాలిక కుటుంబ సభ్యులు కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఓ ఇంట్లో బంధించి మూడు రోజులపాటు అన్నం, నీళ్లు ఇవ్వకుండా తీవ్రంగా హింసించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాళ్లు, చేతులు కట్టేసి ఇనుపరాడ్లతో దారుణంగా కొట్టినట్లు ఆరోపిస్తున్నారు.తీవ్రంగా గాయపడిన మోనును మే 20న రోడ్డుపై పడేసి నిందితులు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మోను మృతి చెందాడు. యువ క్రీడాకారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫరీదాబాద్ పోలీసులు కిడ్నాప్, హత్య కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఇద్దరు ప్రధాన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ ఘటనపై స్థానిక క్రీడా సంఘాలు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ వ్యవహారం పేరుతో యువ క్రీడాకారుడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడం అమానుషమని మండిపడుతున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# లడాఖ్‌లో కుప్పకూలిన ఆర్మీ చాపర్

**తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు సైన్యాధికారులు**

**ప్రమాద స్థలంలో సెల్ఫీ దిగిన మేజర్ జనరల్**

**న్యూఢిల్లీ, మే 23**
లడాఖ్‌లో భారత సైన్యానికి చెందిన చీతా హెలికాప్టర్ కూలిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లేహ్ సమీపంలోని తంగ్సే ప్రాంతంలో మే 20న ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తాజాగా ధృవీకరించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ఉన్నతస్థాయి సైన్యాధికారులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. సైన్యాధికారుల వివరాల ప్రకారం.. కూలిన హెలికాప్టర్‌లో లెఫ్టినెంట్ కల్నల్, ఓ మేజర్ పైలెట్‌తో పాటు 3వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌కు చెందిన మేజర్ జనరల్ సచిన్ మెహతా ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలైనప్పటికీ ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం అనంతరం కూలిపోయిన హెలికాప్టర్ వద్ద మేజర్ జనరల్ సచిన్ మెహతా దిగిన సెల్ఫీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కొండ ప్రాంతంలోని రాళ్ల మధ్య కూలిపోయిన హెలికాప్టర్ పక్కన కూర్చుని తీసుకున్న ఆ ఫోటో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. తీవ్ర ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడటాన్ని చాలామంది అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. లడాఖ్ వంటి ఎత్తైన పర్వత ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతూ ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో పాత చీతా హెలికాప్టర్లు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమాచారం. ఈ ఘటనపై సైన్యం అధికారిక దర్యాప్తుకు ఆదేశించింది. చీతా హెలికాప్టర్లను భారత సైన్యం 1970 దశకంలో వినియోగంలోకి తీసుకువచ్చింది. 1984లో జరిగిన ఆపరేషన్ మేఘదూత్ సమయంలో సియాచిన్ గ్లేసియర్ ప్రాంతంలో ఈ హెలికాప్టర్లు కీలక పాత్ర పోషించాయి. ఎత్తైన ప్రాంతాల్లో ప్రయాణాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ హెలికాప్టర్లలో ఐదుగురు వరకు ప్రయాణించవచ్చు. అయితే గతంలో కూడా చీతా హెలికాప్టర్లు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ప్రమాదాల్లో పలువురు పైలెట్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజా ఘటనతో మరోసారి చీతా హెలికాప్టర్ల భద్రతపై చర్చ మొదలైంది.





# దేశంలో నకిలీ లాయర్ల కలకలం

**40 శాతం వరకు నకిలీ న్యాయవాదులే**


**బార్ కౌన్సిల్ సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, మే 23**
దేశవ్యాప్తంగా కోర్టుల్లో నల్ల కోట్లు వేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల్లో భారీ సంఖ్యలో నకిలీ లాయర్లు ఉన్నారంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు న్యాయవాదులు నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నారని బీసీఐ ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా వెల్లడించారు. నకిలీ డిగ్రీలను కొనుగోలు చేయడం లేదా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించడం ద్వారా పలువురు కోర్టుల్లో న్యాయవాదులుగా కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం బార్ కౌన్సిల్ దృష్టికి వచ్చిందని, ఇప్పటికే దీనిపై ప్రత్యేక చర్యలు ప్రారంభించామని తెలిపారు. నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అరికట్టేందుకు బీసీఐ దేశవ్యాప్తంగా న్యాయవాదుల విద్యార్హతల పరిశీలన చేపట్టింది. అడ్వకేట్ల డిగ్రీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఫారాలు సమర్పించాలని కోరగా, దాదాపు 40 శాతం మంది ఇప్పటివరకు వెరిఫికేషన్ ఫారాలు నింపలేదని వెల్లడించారు. ఫారాలు సమర్పించని వారిపై బీసీఐ అనుమానం వ్యక్తం చేస్తోంది.ఈ అంశాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు భంగం కలిగించే ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన "కాక్రోచ్ జనతా పార్టీ" వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. గత వారం ఒక పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కొందరు నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్నారని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. అలాంటి వారినే ఉద్దేశిస్తూ "కాక్రోచ్" అనే పదాన్ని ఉపయోగించారని స్పష్టం చేశారు. నకిలీ డిగ్రీల వ్యవహారంపై అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా కోరే అవకాశముందని బీసీఐ వర్గాలు సూచిస్తున్నాయి. న్యాయవృత్తి పవిత్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తప్పవని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ట్రంప్‌ను ఎగతాళి చేసిన ఇరాన్

**బంగ్లాదేశ్ దున్నపోతుతో వ్యంగ్య పోస్టు వైరల్**





**న్యూఢిల్లీ, మే 23:**
అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఇరాన్ మరోసారి అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్య పోస్టుతో వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్‌లో ట్రంప్‌ను పోలి ఉన్న తెల్ల దున్నపోతుకు సంబంధించిన వీడియోను రష్యాలోని ఇరాన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ ఎగతాళి చేసింది. "ట్రంప్‌తో పోల్చడం వల్ల మనస్తాపానికి గురైన ఆ మూగజీవం ప్రస్తుతం తిండి తినడం మానేసింది" అంటూ ఇరాన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ పోస్టుపై ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని నారాయణ్‌గంజ్ జిల్లాకు చెందిన ఈ భారీ తెల్ల దున్నపోతు ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. సుమారు 700 కిలోల బరువున్న ఈ దున్నపోతు తలపై ఉన్న జుట్టు, ముఖ ఆకృతి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉన్నాయని పలువురు నెటిజన్లు కామెంట్లు చేశారు.దీంతో దాని యజమాని సరదాగా ఆ దున్నపోతుకు "డొనాల్డ్ ట్రంప్" అని పేరు పెట్టాడు. ప్రస్తుతం బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ దున్నపోతును చూడటానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ బక్రీద్ సందర్భంగా దాన్ని బలివ్వాల్సి వస్తుందని యజమాని చెప్పడం పలువురిని నిరాశకు గురిచేస్తోంది. ఈ ఘటన అంతర్జాతీయ రాజకీయాల మధ్య మరోసారి సోషల్ మీడియా చర్చకు దారితీసింది.

# రోడ్లపై నమాజ్ నిషేధానికి కేంద్ర మంత్రి మద్దతు

**న్యూఢిల్లీ, మే 23**



బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నమాజ్ నిర్వహణను నిషేధిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పూర్తి మద్దతు ప్రకటించారు. మతపరమైన కార్యక్రమాల సమయంలో శాంతిభద్రతలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ప్రత్యేకంగా అభినందించారు. దేశంలో కొందరు కావాలనే ఉద్రిక్త వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. ప్రజల సౌకర్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి నిబంధనలు తీసుకురావడం అవసరమని చెప్పారు. ఇలాంటి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇరాన్, అరబ్ దేశాల్లో కూడా వీధుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించరని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ నిబంధనలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు.పండుగల పేరుతో గోవధ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో బలులు ఇవ్వడంపై కూడా కేంద్ర మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ముస్లిం దేశాల్లో కూడా ఇలాంటి పద్ధతులు కనిపించవని అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడం కోసం కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌లో కూడా హిందువులు గోవులను పూజిస్తారని పేర్కొంటూ మతసామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

# రక్తసిక్తంతో ముగిసిన సవతుల బంధం

## పెద్దమ్మ చనిపోయిందని కన్నీటి పర్యంతమౌతోన్న నిందితురాలి కూతుర్లు

మానవత్వం మంటగలిసిందా..?

**ప్రేమ పంచాల్సిన బంధాలు పగతో రగిలితే ప్రాణాలు తీసుకుంటున్నాయా?**

**మానవీయ కోణంలో 'ది తెలంగాణ మిర్రర్' అందిస్తున్న ప్రత్యేక కథనం...**

**సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామంలో చోటుచేసుకున్న మహిళ హత్య ఉదంతం కేవలం ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు... గ్రామీణ సమాజపు బంధాలు, మానవత్వం, పరస్పర అనుబంధాలు ఎంతగా క్షీణిస్తున్నాయో చూపించిన కలచివేసే ఘటనగా మారింది. "అన్నా... బావా... చెల్లెమ్మా... తమ్ముడా..." అంటూ వరుసలు కలుపుకుని ఒక కుటుంబంలా జీవించే పల్లెల్లోనే ఇప్పుడు రక్తపు మరకలు పడటం అత్యంత దురదృష్టకరమని మేధావులు, విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



ఒకే ఇంట్లో దాదాపు ఇరవై ఏళ్లకు పైగా ఇద్దరు భార్యలుగా కలిసి జీవించిన మహిళలు... కాలక్రమేణా ప్రేమ, అనురాగం, పరస్పర గౌరవాన్ని కోల్పోయి ఒకరిపై ఒకరు పెంచుకున్న ద్వేషం చివరకు ప్రాణాలు తీసుకునే స్థాయికి చేరుకోవడం గ్రామ ప్రజలను తీవ్రంగా కలచివేసింది. పెద్ద భార్య రాజ్యలక్ష్మి, చిన్న భార్య రాధ మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్న చిన్న విభేదాలు పెరిగి అనుమానాలు, అసూయలు, కోపాలుగా మారి చివరకు దారుణ హత్యకు దారితీశాయని భావిస్తున్నారు. ఈ ఘటనలో మరింత సంచలనం రేపిన విషయం ఏమిటంటే... హత్య అనంతరం దానిని దొంగతనంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం. ఇటీవల ఎండాకాలం నేపథ్యంలో ప్రజలు ఆరుబయట నిద్రించవద్దని, గ్రామాల్లో దొంగల సంచారం పెరుగుతోందని పోలీసులు ఇంట్లోనే నిద్రించాలని అవగాహన కల్పిస్తున్నారు. అయితే అదే హెచ్చరికలను ఆసరాగా చేసుకుని, ఇంట్లో జరిగిన హత్యను దొంగల పని లాగా మలచి తప్పించుకోవాలని ప్రయత్నించడం అత్యంత పాశవిక చర్యగా గ్రామ ప్రజలు భావిస్తున్నారు. నిద్రలో ఉన్న పెద్ద భార్యపై కర్రతో దాడి చేసి ప్రాణాలు తీసిన తర్వాత, దానిని దొంగతనంగా నమ్మించే ప్రయత్నం చేయడం మానవత్వం ఎక్కడికి చేరుకుందో ప్రశ్నించేలా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మానవత్వమా... ఎక్కడ నీ చిరునామా?" అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరి మనసులో వినిపిస్తోంది. ప్రేమ పంచాల్సిన చేతులు ప్రాణాలు తీయడం, కుటుంబాన్ని కాపాడాల్సిన బంధాలే కుటుంబాన్ని రక్తపు మడుగులోకి నెట్టేయడం సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. ఈ ఘటనలో అత్యంత హృదయ విదారక దృశ్యం పిల్లలది. ఒకవైపు తమ పెద్దమ్మ మృతదేహం... మరోవైపు తమ కన్నతల్లి హత్య కేసులో అరెస్టవడం.. ఆ ఇద్దరు ఆడబిడ్డలను మానసికంగా కుదేలు చేసింది. "పెద్దమ్మ చనిపోయింది. అమ్మను పోలీసులు తీసుకెళ్లారు..." అంటూ చిన్నారులు విలపించిన దృశ్యాలు గ్రామస్తులను సైతం కన్నీటి పర్యంతం చేశాయి. ఒక క్షణిక ఆవేశం, ఒక పెరిగిన పగ... చివరకు రెండు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేసింది. ఇక భర్త పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎన్నో ఏళ్లుగా తనతో జీవించిన ఇద్దరు మహిళల్లో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు జైలుపాలవడంతో అతడు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఒకే గడపలో ప్రేమతో ఉండాల్సిన కుటుంబం... ఇప్పుడు కన్నీటి గూటిగా మారిపోయింది. ఈ ఘటనపై పలువురు మేధావులు, సామాజిక విశ్లేషకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఒకప్పుడు పల్లెల్లో పరస్పర ప్రేమాభిమానాలు బలంగా ఉండేవి. చిన్న చిన్న గొడవలు పెద్దల సమక్షంలో పరిష్కారమయ్యేవి. ఇప్పుడు సహనం తగ్గిపోతోంది. అనుమానాలు, అసూయలు, కోపాలు కుటుంబ బంధాలను కూలదోస్తున్నాయి" అని వారు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా ఉండాలంటే గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. కుటుంబ బంధాల పరిరక్షణ, మహిళల మధ్య పరస్పర గౌరవం, కోప నియంత్రణ, మానసిక ఒత్తిళ్ల నివారణ, కుటుంబ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వంటి అంశాలపై సెమినార్లు, గ్రామసభలు, సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. "మనిషి మనిషిగా ఉండాలి... బంధం అంటే ప్రేమ, సహనం, పరస్పర గౌరవం" అనే విలువలను సమాజంలో మళ్లీ బలంగా నాటాల్సిన సమయం వచ్చిందని మేధావులు అభిప్రాయపడు తున్నారు. మంచినీళ్లబండ ఘటన ఇప్పుడు కేవలం ఒక హత్య కేసు మాత్రమే కాదు... మానవత్వం చనిపోతే కుటుంబాలు ఎలా రక్తపు కథలుగా మారుతాయో చూపించిన విషాద గాథగా నిలిచిపోయింది.

# గగనతలం మూసేసిన ఇరాన్

### - దాడులకు ట్రంప్ సిద్ధం - పశ్చిమాసియాలో ఆందోళనలు



**న్యూఢిల్లీ, మే 23**

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌పై కొత్త సైనిక దాడులకు అమెరికా సిద్ధమవుతోందన్న వార్తలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుని తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. శాంతి చర్చలు నిలిచిపోవడం, అణు కార్యక్రమంపై విభేదాలు మరింత ముదరడంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా మీడియా సంస్థ సీబీఎస్ న్యూస్ కథనం ప్రకారం రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి కనిపించకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా సైనిక, నిఘా విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు తమ సెలవులను రద్దు చేసుకుని అత్యవసర సమావేశాల్లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ట్రంప్ తన వారాంతపు న్యూజెర్సీ పర్యటనను కూడా రద్దు చేసుకుని హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వెళ్లారు. అంతేకాకుండా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహ కార్యక్రమానికి కూడా హాజరుకాలేనని ప్రకటించడం పరిస్థితి ఎంత గంభీరంగా ఉందో తెలియజేస్తోంది. "ప్రస్తుతం దేశ భద్రతకు సంబంధించిన అంశాలు అత్యంత ప్రాధాన్యమైనవి. అందుకే వాషింగ్టన్‌లోనే ఉండాల్సి వస్తోంది" అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదికలో పేర్కొన్నారు. గత ఏప్రిల్‌లో అమెరికా ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వల అంశంపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్రిక్తతలకు ప్రధాన కారణంగా మారింది. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంచుకుంటోందన్న అనుమానాలతో అమెరికా కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం బయటకు తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. అణ్వాయుధ తయారీకి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేస్తోంది. అయితే తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చిచెబుతోంది. ఇది తమ సార్వభౌమ హక్కులకు సంబంధించిన అంశమని, అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరాన్ గగనతలం మూసివేయడం, అమెరికా సైనిక కదలికలు పెరగడం, దౌత్య చర్చలు నిలిచిపోవడం వంటి పరిణామాలు ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు మార్కెట్లపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# చైనా గనిలో విషాదం

### ఘోర గ్యాస్ పేలుడు, 82 మంది మృతి



**బీజింగ్, మే 23**

చైనాలోని ఓ బొగ్గు గనిలో జరిగిన ఘోర ప్రమాదం భారీ ప్రాణనష్టానికి దారితీసింది. ఉత్తర చైనా ప్రాంతంలోని షాంక్సీ ప్రావిన్స్‌లో ఉన్న లూషెన్యు బొగ్గు గనిలో ప్రమాదకరమైన గ్యాస్ పేలుడు సంభవించడంతో ఇప్పటివరకు 82 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా లభించకపోవడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లూషెన్యు గనిలో ఒక్కసారిగా కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకై గని అంతటా వేగంగా వ్యాపించినట్లు సమాచారం. విషవాయువు పరిమితికి మించి చేరుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో గని లోపల వందల సంఖ్యలో కార్మికులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి గని లోపలి ప్రాంతాలు పూర్తిగా దెబ్బతినడంతో కార్మికులు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చైనా అధికారులు భారీ స్థాయిలో సహాయక చర్యలు ప్రారంభించారు. గని లోపల చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ప్రత్యేక రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. అయితే గని లోపల విషవాయువు దట్టంగా అలముకోవడం, ఆక్సిజన్ కొరత ఏర్పడడం సహాయక చర్యలకు పెద్ద అడ్డంకిగా మారింది. కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. చైనాలో గనుల భద్రతపై ఇప్పటికే అనేక విమర్శలు ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు సరిగా పాటించకపోవడం, పాత సాంకేతిక వ్యవస్థలను కొనసాగించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బొగ్గు గనుల్లో కార్మికుల ప్రాణ భద్రతకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ తాజా ప్రమాదంతో మరోసారి గనుల భద్రత అంశం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత గని ప్రాంతం మొత్తం విషాద వాతావరణంలో మునిగిపోయింది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ ప్రమాదం చైనా పారిశ్రామిక రంగంలో భద్రతా వ్యవస్థలపై మరోసారి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# ఏపీ వైపు బండి పయనం..

**తెలంగాణ వివాదాల నడుమ గుంతకల్‌లో బీజేపీ విజయ లక్ష్యం కోసం ప్రచారం**

**అనంతపురం పర్యటనలో పార్టీ కార్యాలయ సందర్శన**

**కార్యకర్తలతో సమావేశమైన బండి సంజయ్**

**క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చ**

**మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం కేడర్‌కు పిలుపు**

**అనంతపురం, మే 23** తెలంగాణ లో కుమారుడి ఫోక్సో కేసు దరిమిల సోషల్ మీడియా లో బండి రాజీనామా చేయాలనే నేపథ్యంలో పార్టీ డ్యామేజ్ కాకుండా బండి ని రక్షించడానికి పార్టీ కొత్త ఎత్తుగడా వేసినట్టు కనిపిస్తుంది కొన్ని రోజుల వరకు తెలంగాణ లో పార్టీ కార్యక్రమాలకి సంజయ్ ని దూరం పెట్టించాలని అయన కు వేటు వేస్తే తెలంగాణ లో పార్టీ డ్యామేజ్ అయ్యే అవకాశం వున్నందున కొంత కాలం వరకు ఏపీ రాజకీయల్లో బండి ని పంపించాలని అందులో భాగంగా శనివారం అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా శనివారం గుంతకల్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశమై క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు చేస్తున్న కృషిని అభినందించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆత్మీయంగా మాట్లాడిన బండి సంజయ్, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కేడర్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంతకల్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరేయాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని బండి సంజయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసంతో పనిచేస్తే గుంతకల్‌లో బీజేపీకి మరింత బలం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు గుంతకల్ ప్రాంత రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణపై బండి సంజయ్‌కు వివరాలు అందించారు. బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# మీకు ప్రామిస్ చేస్తున్నా!..

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకుంది అగ్ర కథానాయిక కంగనా రనౌత్. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. దాంతో ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేస్తుంటుంది. తాజాగా ఆమె వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అందులో కంగనారనౌత్ మెడలో మంగళసూత్రం, చేతులకు గాజులు ధరించి వివాహితలా కనిపిస్తున్నది. దీంతో ఆమె సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందనే వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా వీటిపై ఆమె క్లారిటీనిచ్చింది. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'నేను షూటింగ్‌లో క్యారెక్టర్ మేకప్‌తో ఉండగా ఎవరో ఈ ఫొటో తీశారు. గత కొన్ని రోజులుగా నా పెళ్లి గురించి ఆరాతీస్తూ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. నటులు అన్ని రకాల పాత్రలు చేయాల్సి ఉంటుంది. గెటప్‌ని చూసి పెళ్లయిపోయిందని అనుకుంటున్నారు. నేను మీ అందరికి ప్రామిస్ చేస్తున్నా. ఎట్టిపరిస్థితుల్లో రహస్యంగా పెళ్లి చేసుకోను. మీ అందరికి చెప్పే పెళ్లి చేసుకుంటా' అని కంగనా రనౌత్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ప్రస్తుతం ఈ భామ 'క్వీన్-2' షూటింగ్‌లో ఉంది. ఈ సినిమాలోని పాత్రకోసమే వివాహిత గెటప్‌లో కనిపించిందని సమాచారం.




# పెళ్లి అయ్యిందని చెప్పడంతో చేజారిన సినిమా ఛాన్స్..

## షాకింగ్ విషయాలు బయటపెట్టిన స్రవంతి

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

# మూడు సినిమాల నుంచి ఒక్కసారిగా తప్పించారు

## అర్ధరాత్రి ఏడ్చేశా: అనసూయ భావోద్వేగ వ్యాఖ్యలు



టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ నటిగా కొనసాగుతున్నారు. యాంకర్‌గా వచ్చిన గుర్తింపును నటిగా విజయవంతంగా మలుచుకున్న అనసూయ, ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒక బాధాకర సంఘటనను తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కెరీర్ ప్రారంభంలో క్షణం, సోగ్గాడే చిన్ని నాయన వంటి చిత్రాల్లో అవకాశాలు రావడంతో నటిగా మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అయితే ఆమె కెరీర్‌లో నిజమైన మలుపు మాత్రం రంగస్థలం సినిమా ద్వారా వచ్చిందని చెప్పాలి. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా ఘన విజయం సాధించడంతో అనసూయకు నటిగా డిమాండ్ మరింత పెరిగింది. అయితే విజయాలతో పాటు వివాదాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ కూడా తన జీవితంలో భాగమయ్యాయని అనసూయ తెలిపారు. తనపై జరిగే విమర్శలకు, ట్రోల్స్‌కు అవసరమైనప్పుడు గట్టిగానే సమాధానం ఇస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో జరిగిన ఒక బాధాకరమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "ఒక సమయంలో మూడు క్రేజీ సినిమాల కోసం నన్ను ముందుగా ఎంపిక చేశారు. కానీ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఆ ప్రాజెక్టుల నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తీసేశారు? ఏం జరిగింది? అన్న విషయంపై కనీస వివరణ కూడా ఇవ్వలేదు" అని అన్నారు.ఆ సంఘటన తనను తీవ్రంగా బాధించిందని అనసూయ వెల్లడించారు. "ఆ రోజు రాత్రి చాలా బాధేసింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో భర్త దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేశాను. ఆ బాధను జీర్ణించుకోలేకపోయాను" అని చెప్పారు. అలాగే తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలపై కూడా సోషల్ మీడియాలో అనవసర చర్చలు జరిగాయని ఆమె తెలిపారు. నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు వివాదంగా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు అని పేర్కొన్నారు. అయితే ట్రోలింగ్ గురించి పెద్దగా పట్టించుకోనని, కాలక్రమంలో అలాంటి విషయాలను ఎదుర్కోవడం నేర్చుకున్నానని అనసూయ స్పష్టం చేశారు. "ఎవరు ఏమనుకున్నా, ఎన్ని ట్రోల్స్ చేసినా చివరికి నేను నా పనిని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను" అని ధైర్యంగా చెప్పారు.